సాక్షి
నంద్యాల

శుక్రవారం । 29 । సెప్టెంబర్ । 2023



ఆకట్టుకున్న సంప్రదాయ నృత్యం
శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయంలోని నిత్యకళావేదికపై గురువారం హైదరాబాద్‌కు చెందిన శ్రీలక్ష్మీ శంకరి, నాట్య స్కూల్ ఆఫ్ కూచిపూడి వారి సంప్రదాయ నృత్యప్రదర్శన ఆకట్టుకుంది.



హృదయ వేదన
యువత గుండె లయ తప్పుతోంది. ఇటీవల గుండెజబ్బులతో ఆసుపత్రుల్లో చేరే వారిలో మధ్యవయస్సు వారే అధికంగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది.
- 8లో..



నిర్మాణం అద్భుతం
వెల్దుర్తి: నవరత్న పథకాలను తెలియజేస్తూ నిర్మిస్తున్న ఎల్ నగరం గ్రామ సచివాలయం అద్భుతంగా ఉందని రాష్ట్ర సమాచార కమిషనర్ కాకర్ల చెన్నారెడ్డి అభివర్ణించారు.

న్యూస్‌రీల్

నేడు నంద్యాలలో 'జగనన్నకు చెబుదాం - స్పందన'

నంద్యాల(అర్బన్): ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం నంద్యాల ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో శుక్రవారం మండల స్థాయి 'జగనన్నకు చెబుదాం-స్పందన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని నంద్యాల మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శ్రీశైలానికి కొనసాగుతున్న వరద

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం నీలం సంజీవరెడ్డి సాగర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతుంది. కొద్ది రోజులుగా నదీ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా జలాశయంలోకి వరద నీరు వచ్చి చేరుతుంది. గురువారం సాయంత్రానికి జూరాల, సుంకేసుల నుంచి శ్రీశైలంకు 30,013 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. బుధవారం నుంచి గురువారం వరకు శ్రీశైలం నుండి దిగువ ప్రాంతాలకు 13,119 క్యూసెక్కుల నీరు విడుదలయ్యింది. ప్రసుత్తం జలాశయంలో 91.6176 టిఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 854.90 అడుగులకు చేరుకుంది.

'అనంత' భక్తిపారవశ్యం



అనంతపద్మనాభస్వామి పూజలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో గురువారం అనంత చతుర్దశి వేడుకలు అంగరంగ వైభవంగా సాగాయి. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల నేతృత్వంలో చతుర్దశి వ్రతం చేపట్టారు. ప్రత్యేక పీఠంపై అనంతపద్మనాభస్వా మి మూల విరాట్‌ను ఉంచి అర్చన, అభిషేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. జయ, దిగ్విజయ, మూలరాముల సేవలో పీఠాధిపతి తరించారు. డోలు వాయిద్యాలు, హరిదాసుల కీర్తనలు, పండితుల మంత్రోచ్చారణల మధ్య పరమపవిత్రంగా వేడుక సాగింది. శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్, ధార్మిక సహాయాకాధికారి వ్యాసరాజాచార్, మఠం దివాన్ వాదిరాజాచార్, ద్వారపాలక అనంతస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు కృత్రిమ అవయవాల ప్రదానం

కర్నూలు కల్చరల్: భారత్ వికాస్ పరిషత్ తుంగభద్ర శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో ఉచిత కృత్రిమ అవయవాల అమరిక శిబిరం నిర్వహిస్తున్నట్లు బీవీపీ తిరుపతి ప్రాంత సేవా ప్రముఖ్ రేగూరు బాలకృష్ణ తెలిపారు. కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ తేజ్, ఆర్డీవో సి.హరిప్రసాద్ అతిథులుగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. అవయవాలకు కొలతలు ఇచ్చిన బాధితులు, దాతలు, బీవీపీ సభ్యులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

కొడితే మెరుపు.. విసిరితే మలుపు!

క్రికెట్ వస్తుందంటే చాలు.. అన్నం, నీళ్లు కూడా లేకుండా టీవీల ముందు వాలిపోతారు. ఆటగాళ్లను దేవుళ్లుగా ఆరాధించే క్రీడాకారులు కోకొల్లలు. సంవత్సరాలు గడుస్తున్నాయి.. దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన క్రికెటర్లు రిటైరవుతుండగా, తమ వంతు సత్తా చాటుతూ మరికొందరు క్రీజులో నిల్చొంటున్నారు.. ఆటలోనూ ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో తమ ఇంట్లోనూ ఓ క్రికెటర్ ఉండాలనే భావన తల్లిదండ్రుల్లో కనిపిస్తోంది. ఒకప్పుడు క్రికెట్‌లో ఆడుతున్నాడంటే ఆ ప్రాంతమే కాదు, దేశమంతా ఆ క్రీడాకారుడిని కీర్తించేది. ఐపీఎల్ రాకతో క్రికెట్ గ్రామీణ ప్రాంతాలకు కూడా చేరువైంది. 20 సంవత్సరాల క్రితంతో పోలిస్తే ఇప్పుడు భారతీయ క్రికెట్‌లో వందలాదిగా క్రీడాకారులు మేమున్నామంటూ ముందుకొస్తున్నారు. బ్యాట్‌తో పరుగుల వరద పారిస్తూ.. బాల్‌ను తిప్పేస్తూ రోజుకో ఆటగాడు తెరమీదకొస్తున్నాడు. పురుషులే కాదు.. మహిళలు కూడా తాము ఎందులోనూ తీసిపోమని చాటుతూ క్రికెట్‌లో రాణిస్తున్నారు. దేశ విదేశాల్లో జాతీయ పతాకాన్ని మెరిపిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే స్థానికంగా క్రికెట్ అకాడమీలు ఏర్పాటవుతుండటంతో తల్లిదండ్రులు తమ పిల్లలను వీటిలో చేర్చి ప్రోత్సహిస్తున్నారు. గల్లీల్లో రాళ్లను వికెట్లుగా పెట్టుకొని, టెన్నిస్ బాళ్లతో క్రికెట్ ఆడుతున్న తమ పిల్లలను మురిసిపోయిన కుటుంబ సభ్యులు.. ఇప్పుడు అత్యాధునిక స్టేడియాల్లో, ఫ్లడ్‌లైట్ల వెలుతురులో వేలాది అభిమానులను పోగేసుకుంటున్న తీరుకు మురిసిపోతూ, తమను తాము మైమరుస్తున్నారు.

- సాక్షి, కర్నూలు డెస్క్



మది దోచిన క్రికెట్

- పిల్లలను క్రికెటర్లుగా చూడాలని తల్లిదండ్రుల ఆశ
- పట్టణాల్లోనూ ఏర్పాటవుతున్న అకాడమీలు
- చదువుతో పాటు శిక్షణకు ప్రత్యేక సమయం
- అందుబాటులో ఆధునిక సౌకర్యాలు
- రాణిస్తే తలుపుతట్టనున్న ప్రభుత్వ ఉద్యోగాలు
- అంతకు మించి వేలాది అభిమానులు సొంతం

ఒకప్పుడు క్రికెట్ కొందరికే పరిమితం. జిల్లా విషయానికొస్తే అందుబాటులోని పాఠశాలలు, కాలేజీ లేదా ఖాళీగా ఉన్న స్థలాల్లో క్రికెట్ ఆడటం వరకే తెలుసు. ఒకవేళ అందుబాటులో ఉన్నా అది రెడ్ సాయిల్ పిచ్ మాత్రమే. కీలకమైన మ్యాచ్‌లు అయితే మ్యాట్‌లపై నిర్వహించడం చూశాం. ఇటీవల కాలంలో పరిస్థితిలో బాగా మార్పు వచ్చింది. వైజాగ్‌కే పరిమితమైన టర్ఫ్ వికెట్ కూడా కర్నూలులో అందుబాటులోకి రావడం క్రికెట్ ప్రియులకు శుభవార్త. ప్రస్తుతం సిమెంట్ పిచ్‌తో పాటు మ్యాట్, టర్ఫ్, ఆస్ట్రో టర్ఫ్ పిచ్‌లపై క్రికెట్ శిక్షణ ఇస్తుండటంతో క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర, ఆపై స్థాయిలోనూ రాణించేందుకు అవకాశం ఏర్పడింది.

జిల్లాలో పది మంది రంజీ క్రీడాకారులు

జిల్లాలో 1953 నుంచి క్రికెట్ అసోసియేషన్ ఉంది. కర్నూలులో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓ అకాడమీ నిర్వహిస్తున్నారు. ఇందులో ఇద్దరు కోచ్‌లు, ఒక అసిస్టెంట్, మరొక ట్రైనీ ఉన్నారు. అదేవిధంగా పిచ్ నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమించారు. అయితే క్రికెట్ పట్ల ఆదరణ పెరుగుతుండటంతో నగరంలో మరో నాలుగు ప్రయివేట్ కోచింగ్ అకాడమీలు ఏర్పాటయ్యాయి. క్రికెట్ ఆడటం ఒక ఎత్తయితే, అందులో ఒకస్థాయికి చేరుకోవడం సులువైన విషయమేమీ కాదు. కఠోర శ్రమతోనే అది సాధ్యమవుతుంది. ఉమ్మడి జిల్లా నుంచి ఇప్పటి వరకు పది మంది క్రీడాకారులు మాత్రమే రంజీ స్థాయికి వెళ్లడం చూస్తే పోటీ ఏస్థాయిలో ఉంటుందో అర్థమవుతుంది.

స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు

తల్లిదండ్రులు తమ పిల్లలను ఎంతసేపు మార్కుల వెంట పరుగులు పెట్టిస్తూ మానసికంగా ఒత్తిడి పెంచుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అలాంటి పరిస్థితి లేకపోయినా కార్పొరేట్ పాఠశాలల్లో విద్యార్థులు నాలుగు గోడలకే పరిమితం అవుతుండటంతో పుస్తకాల పురుగులుగానే మిగిలిపోతున్నారు. చదువుకుంటేనే ఉద్యోగాలు వస్తాయనే ధోరణే ఇందుకు కారణమవుతోంది. అయితే స్పోర్ట్స్‌లో రాణించినా ఉద్యోగాలు వస్తాయనేందుకు ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. అందులో భాగంగానే క్రికెట్‌లో రాణించి ఉద్యోగాలు పొందే అవకాశం ఉంది. యూనివర్సిటీ స్థాయిలో క్రికెట్ ఆడితే స్పోర్ట్స్ కోటా వర్తిస్తుంది. అదేవిధంగా స్టేట్ లెవెల్ టాప్-10 ప్లేయర్లు, ఇక రంజీ ఆడితే ఉద్యోగం గ్యారెంటీగా వస్తుందని క్రికెట్ నిష్ణాతులు చెబుతున్నారు.

పెరుగుతున్న ఆదరణ

విద్యార్థుల తల్లిదండ్రుల ఆలోచనా ధోరణి ఇప్పుడిప్పుడే మారుతోంది. క్రికెట్ క్రీడ ప్రపంచాన్ని ఉర్రూతలూగిస్తున్న నేపథ్యంలో తమ పిల్లాడు కూడా బ్యాటు, బాలుతో గుర్తింపు తెచ్చుకోవాలని కోరుకుంటున్నారు. చదువుకు ప్రాధాన్యత ఇస్తూనే క్రికెట్‌లో శిక్షణ ఇప్పించేందుకు ఇష్టపడుతున్నారు. ఉదయం పాఠశాల హడావుడి ఉంటుండటంతో సాయంత్రం వేళల్లోనే శిక్షణకు పంపుతున్నారు. సుమారు 200 మందికి పైగా బాలబాలికలు జిల్లా కేంద్రంలోని క్రికెట్ అకాడమీల్లో శిక్షణ పొందుతుండటం విశేషం.

పిచ్ తయారీ ఖరీదైన వ్యవహారమే..

క్రికెట్‌లో రాణించడం సులువైన విషయమేమీ కాదనేందుకు పిచ్ తయారీని పరిశీలిస్తే అర్థమవుతుంది. ఒక సిమెంట్ పిచ్ తయారీకి రూ.లక్ష వరకు ఖర్చవుతుంది. ఇక ఫ్లడ్ లైట్లు, కోచ్‌లు, సిబ్బంది.. అన్నింటికంటే ముందు ఒకస్థలాన్ని లీజుకు తీసుకొని అకాడమీ నిర్వహించాలంటే సుమారు రూ.15 నుంచి రూ.20లక్షల వరకు ఖర్చవుతుంది. అయితే తమ అకాడమీ తరపున విద్యార్థులను రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఆడించాలనే నిర్వాహకుల బలమైన ఆకాంక్ష క్రీడాకారుల ఉజ్వల భవితకు దారిచూపుతోంది.

ఒక్కొక్కరి ఆలోచన ఒకలా..

కరోనా మహమ్మారి జీవితాలనే మార్చేసింది. పిల్లలు ఇంటికే పరిమితం కావడంతో ఎక్కువగా సెల్‌ఫోన్‌లకు బానిసలు కావడం, ఆన్‌లైన్ గేమ్‌లతో మానసిక రోగులుగా తయారవుతున్న ఘటనలు కోకొల్లలు. ఈ నేపథ్యంలో ఇప్పుడిప్పుడే పిల్లలను మళ్లీ దారిలో పెట్టేందుకు తల్లిదండ్రులు ఎన్నో రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగానే క్రికెట్ అకాడమీల వైపు అడుగులు వేస్తున్నారు. రాణిస్తే పేరు వస్తుందని కొందరు, ఫిట్‌నెస్ వస్తుందని ఇంకొందరు.. మానసికంగా దృఢంగా తయారవుతారనే కారణాలతో అకాడమీల్లో చేరుస్తున్నారు. నిర్వాహకులు ఒక్కొక్కరికి 2 నుంచి 3 గంటల శిక్షణ ఇస్తున్నారు. ఇందుకోసం నెలకు రూ.2వేల వరకు ఫీజు వసూలు చేస్తున్నారు.



14ఏళ్ల లోపు అయితేనే..

క్రికెట్ ఆడాలనే ఆలోచన పిల్లలకు వచ్చినా, తల్లిదండ్రులు ఆ దిశగా అడుగులు వేయించాలనుకున్నా వయస్సును దృష్టిలో పెట్టుకోవడం తప్పనిసరి. క్రికెట్‌లో బేసిక్స్, కేరింగ్, లెర్నింగ్, టిప్స్, షాట్స్.. ఆ తర్వాతే ప్లేయర్‌గా ఎదుగుతారు. ఈ స్థాయికి చేరుకోవాలంటే కనీసం ఐదు సంవత్సరాల సమయం పడుతుంది. 14 ఏళ్లలోపు పిల్లలు అయితేనే ఒకస్థాయికి చేరుకునే అవకాశం, రాణించేందుకు వీలుంటుంది. అదే కాలేజీలో చేరిన తర్వాత క్రికెట్ ఆలోచన వచ్చినట్లయితే సరదాగా బాగుంటుంది కానీ, ప్రొఫెషనల్ స్థాయి శిక్షణ తీసుకున్నా ఉపయోగం ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. 18 ఏళ్లు దాటిన యువతీ యువకులు భవిష్యత్‌ను తీర్చిదిద్దుకునే పనిలో ఉంటారు కాబట్టి, ఆ వయస్సుకు వచ్చిన వాళ్లు క్రికెట్ ఆలోచన చేయకపోవడమే మంచిదంటున్నారు.

క్రికెట్ నా జీవితంలో భాగం



మా సొంతూరు ఆత్మకూరు. కర్నూలులో క్రికెట్ ఎదగక మునుపే మా ఊళ్లోని సినిమా థియేటర్ ప్రాంగణంలో క్రికెట్ ప్రాక్టీస్ చేసేందుకు ఏర్పాట్లు ఉండేవి. మా అన్న రంజీ ప్లేయర్ కావడం, మా మామయ్య కూడా క్రికెట్‌లో రాణిస్తుండటంతో నేను కూడా క్రికెట్‌పై ఆసక్తి పెంచుకున్నా. ఆ ఉత్సాహమే నన్ను రంజీ ప్లేయర్‌గా తీర్చిదిద్దింది. 2017, 18, 19 సంవత్సరాల్లో నేను రంజీ ఆడాను. 18 ఏళ్ల వయస్సులోనే నాకు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం వచ్చింది. నా నరనరాల్లో క్రికెట్ ఉండటంతో ఇప్పటికీ సాయంత్రం వేళ పిల్లలను క్రికెట్‌లో నిష్ణాతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నా.

– శివచరణ్‌సింగ్, సీనియర్ ట్యాక్స్ అసిస్టెంట్, ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్

Karnoolu: కర్నూలుకు చెందిన మురారి రఘు మొబైల్ టెక్నీషియన్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతని భార్య తులసి ఓ ప్రయివేట్ స్కూల్ టీచర్. ఈ దంపతుల కుమారుడు మురారి హృదయ్(15)కి చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే ప్రాణం. నగరంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఈ కుటుంబ ఆర్థిక స్థోమత అంతంతమాత్రమే అయినా క్రికెట్‌లో రాణించేందుకు ఆరేళ్ల వయస్సు నుంచే శిక్షణ ఇప్పిస్తున్నారు. స్వతహాగా ఆసక్తి ఉండటంతో ఈ కుర్రోడు రోజూ మూడు గంటల పాటు శ్రమిస్తూనే చదువుపై దృష్టి సారిస్తున్నాడు. ఇప్పటికే ఇతను అండర్-12, అండర్-14లో రాణించాడు. ఇప్పుడు అండర్-16 లక్ష్యంగా శిక్షణ పొందుతున్నాడు. ఇందులో భాగంగా ఆడిన నాలుగు జోనల్ మ్యాచ్‌ల్లో రెండు ద్విశతకాలు, ఒకసారి 80 పరుగులు చేయడం విశేషం.



మహానందిలో మరో నాలుగు నూతన సేవలు

మహానంది: మహానందీశ్వర ఆలయంలో మరో నాలుగు నూతన సేవలు అమలుకు శ్రీకారం చుట్టనున్నట్లు ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మహానందిలో గురువారం 18వ ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రదోషకాలపూజ, అన్నప్రాసన, నామకరణం, అక్షరాభ్యాసం సేవలను నూతనంగా ప్రవేశపెట్టేందుకు ప్రతిపాదన చేశారు. దీనిపై వైదిక కమిటీ వారిచే చర్చించి సేవల సామగ్రి పరిమాణం, అందుకు అయ్యే ఖర్చు వివరాలను వచ్చే సమావేశానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. సేవలు నిర్వహించేందుకు రుసుం రూ. 200గా ధర్మకర్తల మండలి తీర్మానించింది. అలాగే రూ. 50 లక్షలతో ఆలయ పరిధిలోని గాజులపల్లె వైపు, నంది సర్కిల్ నుంచి కరివేన సత్రం వరకు, గాజులపల్లె రోడ్డులో కల్వర్టు, టీటీడీ కల్యాణ మండపం నుంచి వాటర్‌ప్లాంట్ వరకు కాంక్రీట్, సిమెంట్ రోడ్ల నిర్మాణాన్ని త్వరగా చేపట్టాలని కోరారు. సమావేశంలో ఆలయ ప్రధానార్చకులు, ఎక్స్ అఫీషియో సభ్యుడు మామిళ్లపల్లి అర్జునశర్మ, వేదపండితులు రవిశంకర అవధాని, సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు, ధర్మకర్తలు పాల్గొన్నారు.



ట్రస్ట్‌బోర్డు సమావేశంలో చర్చిస్తున్న చైర్మన్, ఈఓ, సభ్యులు

నేడు వైఎస్సార్ వాహన మిత్ర ఆర్థిక సాయం




నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ వాహన మిత్ర లబ్ధిదారులకు శుక్రవారం ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు జిల్లా రవాణా శాఖ అధికారి శివారెడ్డి గురువారం సాయంత్రం తెలిపారు. వైఎస్సార్ వాహనమిత్ర పథకం కింద ఆటో, క్యాబ్, ట్యాక్సీ డ్రైవర్లకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని వారి ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. విజయవాడ నగరం విద్యాపురంలో నిర్వహించే బహిరంగ సభలో సీఎం బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తారన్నారు. జిల్లాలో 9,521 మందికి వాహన మిత్ర లబ్ధిదారుల ఖాతాల్లో రూ.9.52 కోట్లు జమ చేయనున్నట్లు తెలిపారు. వాహన మిత్ర డ్రైవర్లందరూ నంద్యాల జిల్లా కేంద్రం కలెక్టర్‌రేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించే కార్యక్రమానికి హాజరు కావాలన్నారు.

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి

ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను విజయవంతం చేయండి

నంద్యాల: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపి విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కారదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లకు సూచించారు. గురువారం ఆయన ఆయా శాఖలకు చెందిన కార్యదర్శులతో కలిసి వర్చువల్ విధానంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, జగనన్న ఆరోగ్య సురక్ష, ప్రాధాన్యత భవనాలు, గృహ నిర్మాణాలు, జగనన్న ఆరోగ్య సురక్ష తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ చాంబర్ నుంచి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి, జిల్లాధికారులు వీడియో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన కారదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి ఆయా కార్యక్రమాలు, పథకాల లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రయోగాత్మకంగా నిర్వహించిన వైద్య శిబిరంలో గుర్తించిన లోటుపాట్లను సరి చేసుకుని ఈనెల 30 నుండి ప్రారంభమయ్యే జగనన్న సురక్ష క్యాంపులను పటిష్టంగా నిర్వహించేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య అధికారులకు సూచించారు. జగనన్న లేఅవుట్లలో మంజూరు చేసిన 98 ఆర్బీల నిర్మాణాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ పీడీని ఆదేశించారు. అలాగే వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణాలను కూడా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలైన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్‌ల నిర్మాణ పనులు కూడా వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జలజీవన్ మిషన్ కింద పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయాలన్నారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో చిరుధాన్యాల ఉత్పత్తికి చర్యలు తీసుకోవాలన్నారు.



మహా నిమజ్జనం

కర్నూలు నగరంలో 56 అడుగుల మట్టి వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించిన చోటే గురువారం తుంగభద్ర నది నీటితో నిమజ్జనం చేశారు. వేడుకను తిలకించేందుకు వేలాది మంది జనం తరలివచ్చారు. ఉత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

– కర్నూలు కల్చరల్

భక్తుల సలహాలు స్వీకరించండి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం అభివృద్ధి, ఆలయ సేవలపై భక్తుల సలహాలు, సూచనలు స్వీకరించేందుకు అన్ని వసతి సముదాయాలు, కాటేజీల వద్ద రిజిస్టర్లు ఏర్పాటు చేయాలని దేవస్థానం అధికారులను ఈఓ డి.పెద్దిరాజు ఆదేశించారు. గురువారం ఆయన సెంట్రల్ రిసెప్షన్ ఆఫీసు, గంగాసదన్-గౌరీసదన్, మల్లికార్జున సదన్, పాతాళేశ్వర సదన్, యజ్ఞవాటిక వద్దగల టూరిస్టు షెడ్లు, పలు కాటేజీలు, భారత్‌పెట్రోల్‌బంక్, వైద్యశాల మొదలైన వాటిని పరిశీలించారు. మల్లికార్జున సదన్, పాతాళేశ్వరసదన్ మెట్లపై వృద్ధులు, దివ్యాంగులకు సౌకర్యంగా ఉండేలా ర్యాంప్‌లను ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అన్ని వసతి సముదాయాల వద్ద భక్తులు తిలకధారణ వీలుగా విభూతి, కుంకుమలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అనంతరం కాల్‌సెంటర్‌ను పరిశీలించి, భక్తులు అడిగే సాధారణ సమాచారాన్ని వివరంగా తెలియజేయాలని సిబ్బందికి సూచించారు. వైద్యశాలలో అందుబాటులో ఉండే పరికరాలు, వైద్యసేవలు, రక్తపరీక్షలు మొదలైన వాటి గురించి వైద్యసిబ్బంది ఈఓకు వివరించారు. ఈఓ వెంట ఈఈ వి.రామకృష్ణ, ఏఈవో హరిదాసు తదితరులు పాల్గొన్నారు.



వసతి సముదాయాల వద్ద పరిశీలన చేస్తున్న ఈఓ డి.పెద్దిరాజు

క్లుప్తంగా

పాలిటెక్నిక్‌లో 3న స్పాట్ అడ్మిషన్లు

కర్నూలు సిటీ: నగర శివారులోని బి.తాండ్ర పాడు దగ్గర ఉన్న ప్రభుత్వ మైనార్టీ పాలిటెక్నిక్ కాలేజీలో మిగిలిన సీట్లను వచ్చే నెల 3వ తేదీన స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్లు ఆ కాలేజీ ప్రిన్సిపాల్ ఎ.చక్రవర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆటోమొబైల్, మెకానికల్ ఇంజినీరింగ్ బ్రాంచిలలో సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఇంత వరకు ఏ కాలేజీలో ప్రవేశం పొందని వారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని రావాలని, రూ.5800 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 9949571971, 9441118889 నంబర్లను సంప్రదించాలన్నారు.

30న స్పోర్ట్స్ మీట్

కర్నూలు(అర్బన్): స్థానిక సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల మైదానంలో ఈ నెల 30న పశు సంవర్ధక శాఖ ఉద్యోగుల స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరియన్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు జీ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం స్థానిక ఏపీ ఎన్‌జీఓ హోంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర చైర్మన్ బీ సేవానాయక్ ఆదేశాల మేరకు స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలోనే అక్టోబర్ 1న పాత బస్టాండ్ సమీపంలోని వెటర్నరీ పాలీ క్లినిక్ సమావేశ మందిరంలో నాల్గవ జోన్ స్థాయి కార్యవర్గ సమావేశం, ఉమ్మడి కర్నూలు జిల్లా సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాల్లోని నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరియన్స్, పశు సంవర్ధక శాఖ సహాయకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఫెడరేషన్ నాయకులు, ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన జాయింట్ డైరెక్టర్స్, ఏపీ ఎన్‌జీఓస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ వెంగళరెడ్డి, వీ జవహర్‌లాల్ హాజరుకానున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు జనార్దన్‌రెడ్డి, ఎస్ రంగన్న, ఏఎండీ యూసఫ్, కే సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హృదయ వేదన



మనిషి గుండె బలహీనమవుతోంది. ఒకప్పుడు 60 ఏళ్లు దాటిన వారికి మాత్రమే వచ్చే గుండెజబ్బులు నేడు 20 ఏళ్లకే పలకరిస్తున్నాయి. కోవిడ్ అనంతరం ఈ పరిస్థితి మరింత అధికమైంది. ఆడుతూ పాడుతూ ఉండే యువకులు ఉన్నఫలంగా కుప్పకూలి చనిపోతున్న సంఘటనలు నిత్యం ఎక్కడో ఒకచోట చూస్తూనే ఉన్నాము. ఇటీవల కాలంలో గుండె చేతబట్టుకుని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రికి వస్తున్న వారిలో 20 నుంచి 40 ఏళ్ల మధ్యవయస్సు వారే అధికమని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గుండెజబ్బులపై అవగాహన పెంచుకోవడం ఒక్కటే దీనికి మార్గం. ఈ నెల 29వ తేదీన ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

- యువకుల్లో పెరుగుతున్న గుండెపోటు మరణాలు
- ఉన్నఫలంగా కుప్పకూలుతున్న యువత
- కరోనా తర్వాతే ఈ పరిస్థితి
- కారణాలు అన్వేషిస్తున్న వైద్యులు
- ఒత్తిడి జీవితంతో మరింత కృంగుబాటు
- నేడు వరల్డ్ హార్ట్ డే

కర్నూలు(హాస్పిటల్)/నంద్యాల టౌన్: యువత గుండెలయ తప్పుతోంది. గుండెపోటుతో ఆసుపత్రుల్లో చేరే వారి సంఖ్య చూస్తే భయాందోళన కలిగిస్తోంది. జీవనశైలిలో మార్పులో, కరోనానో ఇతర కారణాలతో తెలియదు కానీ గుండెజబ్బుల బారిన పడే వారి సంఖ్య పెరుగుతోంది. వయస్సుతో సంబంధం లేకుండా హృదయ సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రితో పాటు ప్రైవేటులోనూ కార్డియాలజిస్టుల వద్దకు ప్రతిరోజూ 300 నుంచి 400 మంది వరకు చికిత్స అందుకుంటున్నారు. ఇందులో రోజూ 20 నుంచి 25 మంది వరకు గుండెపోటుతో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. 90 శాతం రోగులకు డాక్టర్ వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ ద్వారానే ఉచితంగా వైద్యసేవలు అందుతున్నాయి. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని కార్డియాలజీ విభాగంలో ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఓపీ నిర్వహిస్తున్నారు. ఓపీ ఉన్న ప్రతిరోజూ ఇక్కడకు 200 నుంచి 250 మంది చికిత్స కోసం వస్తుండగా, ఇన్‌పేషంట్లుగా నెలకు 350 నుంచి 400 మంది వరకు చేరి చికిత్స పొందుతున్నారు. 2008లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఈ విభాగానికి కేథలాబ్ యూనిట్‌ను మంజూరు చేశారు. అప్పటి నుంచి కొన్ని వేల మందికి యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్టీ సేవలను అందించారు. రెండేళ్లుగా ఈ మిషన్ పాతబడటంతో రాష్ట్ర ప్రభుత్వం కొత్త మిషన్ కొనుగోలు చేసింది. ప్రస్తుతం దీనిని ఏర్పాటు చేసే ప్రక్రియ కొనసాగుతోంది. అప్పటి వరకు రోగులకు ఇబ్బంది లేకుండా ప్రైవేటు ఆసుపత్రిలో యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్టీ సేవలను ఉచితంగా అందిస్తున్నారు. అలాగే కార్డియోథొరాసిక్ సర్జరీ విభాగంలో 2016 నుంచి ఇప్పటి వరకు 500లకు పైగా గుండె, ఊపిరితిత్తుల ఆపరేషన్లు నిర్వహించారు.

జీవనశైలిలో మార్పులతోనే..

కోవిడ్ సమయంలో చాలా మంది ఎక్కువగా కొవ్వు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకున్నారు. ప్రొటీన్స్ ఎక్కువగా ఉండాలని, ఇందుకోసం మాంసాహారాన్ని బాగా తీసుకోవాలని సోషల్ మీడియాలో ప్రచారం ఎక్కువగా చేయడంతో ఈ పరిస్థితి నెలకొందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చాలా మందిలో శరీరంలో కొలస్ట్రాల్ స్థాయిలు విపరీతంగా పెరిగినట్లు గుర్తించినట్లు వైద్యులు చెబుతున్నారు. ఈ కారణంగానే చిన్న వయస్సు వారిలోనూ గుండెపోటు కేసులు ఎక్కువగా కనిపిస్తున్నట్లు తెలుస్తోందని పేర్కొంటున్నారు. అంతుచిక్కని కోవిడ్ వైరస్ శరీరంలో ఎలాంటి ప్రభావం చూపిస్తుందో ఇప్పటి వరకు ఎక్కడా సరైన ఆధారాలు లభించలేదు. వైరస్ కూడా గుండెపోటు మరణాలు ఎక్కువ కావడానికి కారణమై ఉండవచ్చని వారు భావిస్తున్నారు. శారీరక శ్రమలేని వ్యక్తుల రక్తంలో కొలస్ట్రాల్ శాతం ఎక్కువగా ఉండటం వల్ల వారిలో గుండెజబ్బులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. మధుమేహవ్యాధి గుండె రక్తనాళాలను దెబ్బతినేటట్లు చేయడం వల్ల కూడా గుండెజబ్బులు రావచ్చు.



కర్నూలు సర్వజన వైద్యశాలలోని గుండెజబ్బుల విభాగం

గుండెపోటు లక్షణాలు

కొద్దిదూరం నడవగానే ఆయాసం, ఛాతిలో పట్టేసినట్లుగా ఉండటం, చెమట ఎక్కువగా పడుతుండటం, శ్వాసతీసుకోవడంలో ఇబ్బంది పడుతుండటం ఉంటే గుండెజబ్బుగా అనుమానించాల్సి ఉంటుంది. ఈ మేరకు సమీప ఆసుపత్రికి వెళ్లి వైద్యపరీక్షలు చేయించుకుని, అవసరమైన చికిత్స తీసుకోవాలి. గుండెపోటు వచ్చిన మొదటి కొద్దినిమిషాలు కీలకమైనవి.

గుండెజబ్బులు రాకుండా ఉండాలంటే...

- మద్యపానం, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి.
- ప్రతిరోజూ వాకింగ్, యోగా, ధ్యానం చేయాలి
- శాస్త్రీయ సంగీతం వినాలి, పాత పాటల్లోని సాహిత్యం మనస్సుకు ఎంతో హాయినిస్తుంది. పాశ్చాత్య సంగీతం బీపీ, హార్ట్ బీట్‌ను పెంచుతుంది.
- లిఫ్ట్‌లో వెళ్లడం కంటే మెట్లు ఎక్కడమే మేలు
- నూనెలో వేయించిన ఆహారాన్ని తగ్గించుకోవాలి. బయట లభించే ఫాస్ట్‌ఫుడ్స్, బేకరి ఫుడ్స్‌కు, దిగుమతి చేసుకున్న చికెన్ లెగ్స్‌కు దూరంగా ఉండాలి.
- బజ్జీలు తినాల్సి వస్తే ఇంట్లోనే చేసుకోవాలి.
- బీపీ, షుగర్‌ను నియంత్రణలో ఉంచుకోవాలి.
- స్థూలకాయం తగ్గించుకోవాలి.
- వయస్సుకు తగినట్లు నిద్రపోవాలి.
- ధూమపానం ఉంటే 72 శాతం, అధిక కొలస్ట్రాల్ ఉంటే 52 శాతం, కుటుంబంలో ఎవరికైనా హార్ట్ ఎటాక్ బారిన పడిన వారు ఉంటే 35 శాతం గుండెపోటు వచ్చే అవకాశం యువతలో ఎక్కువగా ఉన్నాయి.

గుండెపోటు రావడానికి కారణాలు

- ధూమపానం, నెయ్యి వాడకం
- పరగడుపున రక్తంలోగ్లూకోజ్ ఎక్కువగా ఉండటం
- అధిక కొలస్ట్రాల్, రక్తపోటు
- శారీరక వ్యాయామం బాగా తగ్గడం
- తల్లిదండ్రుల్లో, తోబుట్టువలలో ఎవ్వరికైనా గుండెపోటు వచ్చినా కానీ ముందుగానే ఈ సమస్య ఉండటం
- లిపోప్రోటీన్-ఎ, హైపర్ హోమోసిస్టెమియా, హైపర్ కాగ్యులబుల్ పరిస్థితి
- కొకైన్ వాడకం లాంటివి ఉంటే ఈ సమస్యలు వస్తాయి.

కరోనా వచ్చిన వారు పరీక్షించుకోవాలి



కోవిడ్-19 తీవ్రంగా వచ్చి ఐసీయూలో చేరిన వారి రక్తనాళాల్లో బ్లాక్‌లు ఉంటున్నాయి. కోవిడ్‌కు గురైన వారిలో గుండెపోటు, పక్షవాతం వస్తున్నవారు ఎక్కువగా ఉన్నారు. కాబట్టి గతంలో తీవ్రంగా కోవిడ్‌కు గురైన వారు మళ్లీ ఓసారి గుండెపరీక్షలు చేయించుకోవాలి. రక్తనాళాల్లో ఏవైనా సమస్యలుంటే అవసరమైన చికిత్స తీసుకుంటే గుండెపోటుకు గురికాకుండా ఉండవచ్చు.

– డాక్టర్ చైతన్యకుమార్, కార్డియాలజిస్టు, కర్నూలు

అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలి



మన గుండెను పదిలంగా చూసుకోవాలని, దానికి ప్రధాన శత్రువులైన ధూమపానాన్ని పూర్తిగా వదిలేయడం, మధుమేహాన్ని అదుపులో పెట్టుకోవడం ముఖ్యం. గుండెకు సంబంధించిన లక్షణాలను గమనించుకుంటూ అవగాహన పెంచుకోవడమే ముఖ్యం. ప్రధానంగా ధూమ, మద్యపానం అలవాటు ఉండటం, సరైన ఆహారం తీసుకోకపోవడంతోనే గుండె వ్యాధులు వస్తున్నాయి.

– డాక్టర్ నాగేంద్రప్రసాద్, కార్డియాలజిస్టు, కర్నూలు

వైద్య నిపుణుల సలహాలు పాటించాలి



ఇటీవల గుండె జబ్బులు పెరుగుతున్నాయి. పని ఒత్తిడితో నిద్రలేమి, ఫాస్ట్ ఫుడ్ తినడం, శరీరంలో కొవ్వు నిల్వలు పెరగటం వల్ల యుక్త వయసులోనే గుండె పోటుకు గురవుతున్నారు. ప్రతి ఒక్కరు వ్యాయామం చేస్తూ ఎంపిక చేసుకున్న మంచి ఆహారం తీసుకోవటం, వైద్య నిపుణుల సూచనలు పాటించడం వల్ల గుండె పోటు బారి నుండి బయట పడవచ్చు. – డాక్టర్ మురళీకృష్ణ, కార్డియాలజిస్ట్, నంద్యాల

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి చర్యలు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు కల్చరల్: జిల్లాలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో గురువారం సిల్వర్ జూబ్లీ కళాశాలలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, నగర మేయర్ బీవై రామయ్య కుటుంబ సభ్యులతో కలసి వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పర్యాటక ప్రాంతాలైన ఓర్వకల్లు రాక్ గార్డెన్, కేతవరం ప్రాచీన రాతి గుహలు, లక్ష్మీపురం వద్ద ఉన్న జగన్నాథగట్టును అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్ర స్థాయిలో కర్నూలు పర్యాటక శాఖ అధికారి విజయ అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. అదే విధంగా బెస్ట్ టూరిస్ట్ ఫ్రెండ్లీ ఎయిర్‌పోర్టు పురస్కారాన్ని ఓర్వకల్లు విమానాశ్రయ డైరెక్టర్ విద్యాసాగర్ అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. మేయర్ రామయ్య మాట్లాడుతూ కలెక్టర్ కుటుంబంలో కూడా కళాకారులు ఉన్నారన్నారు. అందుకే కళాకారులనుప్రోత్సహించడం తెలుసన్నారు. ప్రపంచ పర్యా టక దినోత్సవాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించారన్నారు. టూరిజం అధికారి విజయ మాట్లాడుతూ ..గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది గొప్పగా వేడుకలు నిర్వహించామన్నారు. కూచిపూడి నృత్యం, ఫిల్మ్ ఇండస్ట్రీ కొరియోగ్రాఫర్ డాల్ కింగ్ మోహన్ బాబు ప్రదర్శన ఆకట్టుకున్నాయి. అనంత రం రాష్ట్రస్థాయిలో అవార్డులు పొందిన వారిని, కళాకారులను సన్మానించారు. కార్యక్రమంలో కలెక్టర్ తల్లిదండ్రులు రిటైర్డ్ ఐఏఎస్ గుమ్మళ్ల బలరామయ్య, సుగుణ, డీఆర్వో మధుసూదనరావు, ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీనివాస్, మత్స్య శాఖ అధికారి శ్యామల, సిల్వర్‌జూబ్లీ కళాశాల ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్ పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మేయర్ రామయ్య. చిత్రంలో కలెక్టర్ సృజన తదితరులు

'అశోకా' కళాశాలకు అటానమస్ హోదా

కల్లూరు: దూపాడు సమీపంలోని అశోకా మహిళా ఇంజినీరింగ్ కళాశాలకు స్వయం ప్రతిపత్తి (అటానమస్)హోదా లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.నవీన్ గురువారం విలేకరులకు తెలిపారు. కళాశాలలో అధ్యాపకులు, నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థినులు కేక్ కట్ చేసి, బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 2023–2024 నుంచి 2032–2033 వరకు 10 సంవత్సరాల కాలానికి ఈ హోదా లభించిందన్నారు. స్వయం ప్రతిపత్తికి అనుగుణంగా సిలబస్, కోర్సులను మార్పు చేసుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు.

బాలికల వసతి గృహాల్లో సీసీ కెమెరాలు

- జేడీ జే రంగలక్ష్మిదేవి

కర్నూలు(అర్బన్): కళాశాల బాలికల వసతి గృహాలకు సంబంధించి కచ్చితంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జే రంగలక్ష్మిదేవి అన్నారు. గురువారం ఆమె నగరంలోని సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలికల 1, 2 వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినుల కోసం తయారు చేసిన ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థినులతో ప్రత్యేకంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ మెనూ తప్పనిసరిగా పాటించాలని, వసతి గృహ సంక్షేమాధికారులు సమయపాలన పాటించాలన్నారు. ప్రతి రోజూ బయో మెట్రిక్ హాజరు నమోదు చేయాలని, హాస్టల్స్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జేడీ వెంట కర్నూలు సహాయ సంక్షేమాధికారి బీ మద్దిలేటి, వసతి గృహ సంక్షేమాధికారిణులు బెన్నమ్మ, శిరీష ఉన్నారు.



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న జేడీ జే రంగలక్ష్మిదేవి

తేనెటీగల దాడిలో వృద్ధురాలి మృతి

ప్యాపిలి: పీఆర్ పల్లి సమీపంలో గురువారం తేనెటీగల దాడిలో ఫకృన్‌బీ (63) అనే వృద్ధురాలు మృతి చెందింది. ఫకృన్‌బీ తన కుమారుడు మహబూబ్ బాషా, మనవళ్లు షఫి బాషా, మొహిద్దీన్‌తో కలసి గురువారం పొలానికి వెళ్లింది. పొలం పనుల్లో ఉన్న వారిపై ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేసి గాయపర్చాయి. తీవ్రంగా గాయపడిన ఫకృన్‌బీని చికిత్స నిమిత్తం డోన్‌కు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందింది. తేనెటీగల దాడిలో తీవ్రంగా గాయపడిన ఆరు సంవత్సరాల షఫి బాష డోన్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మహబూబ్ బాష, మొహిద్దీన్ స్వల్పంగా గాయపడ్డారు.



ఫకృన్‌బీ (ఫైల్)

పాఠశాలకు చేరుకున్న విద్యార్థులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం గిరిజన గురుకుల పాఠశాల నుంచి వారం రోజుల క్రితం అదృశ్యమైన నలుగురు విద్యార్థులు క్షేమంగా తిరిగి పాఠశాలకు చేరుకున్నారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న నాగేశ్వారి, నాగరాజునాయక్, విజయ్, రామ్‌చరణ్ ఈనెల 20వ తేదీ పాఠశాల నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. గమనించిన అక్కడి సిబ్బంది వెంటనే ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రెడ్డప్ప దృష్టికి తీసుకెళ్లగా ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా నలుగురు గుంటూరులో ఉన్నట్లు తేలింది. ఎస్‌ఐ గంగయ్య యాదవ్, కానిస్టేబుల్ రజాక్ గురువారం అక్కడికి చేరుకుని విద్యార్థులను అదుపులోకి తీసుకుని సున్నిపెంట స్టేషన్‌కు తరలించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రెడ్డప్పకు నలుగురు విద్యార్థులను అప్పగించారు.

'సుంకేసుల'కు 8,450 క్యూసెక్కుల ఇన్ ఫ్లో

గూడూరు: సుంకేసుల జలాశయానికి గురువారం 8,450 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ఎగువ ప్రాంతాలలో కురిసిన వానలకు ఇన్‌ఫ్లో ఉన్నట్లు డ్యామ్ అధికారులు తెలిపారు. ఒక గేట్‌ను మీటరు, మరోగేట్‌ను అర మీటర్ మేర ఎత్తి దిగువకు 6,710 క్యూ సెక్కుల నీటిని విడుదల చేశారు. కేసీ కాల్వకు 1,616 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. డ్యామ్‌లో 1.194 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

టీబీ డ్యాం సమాచారం



పూర్తిమట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,618.55
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	: 57.112
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 881
ఔట్‌ఫ్లో(క్యూసెక్కులు)	: 9,549

వైభవంగా శ్రీశైల గిరి ప్రదక్షిణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీశైల గిరి ప్రదక్షిణ వైభవంగా నిర్వహించారు. గురువారం సాయంత్రం స్వామిఅమ్మవార్లను పల్లకీలో ఉంచి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను ధర్మప్రచార రథంలో ఉంచి ఊరేగింపుతో శ్రీశైల గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. ఆలయ మహాద్వారం నుంచి మొదలైన ప్రదక్షిణ గంగాధర మండపం, అంకాళమ్మ ఆలయం, నందిమండపం, గంగాసదనం మీదుగా బయలు వీరభద్ర స్వామి ఆలయం అక్కడి నుంచి అలంకారేశ్వర ఆలయం మీదుగా ఔటర్‌రింగ్‌రోడ్డు, హేమారెడ్డి మల్లమ్మ మందిరం, మహిషాసురమర్దిని, రుద్రాక్షమఠం, విభూతిమఠం, రుద్రవనం, నందిమండపం వరకు ప్రదక్షిణ నిర్వహించారు. పూజల్లో దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు దంపతులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, ఈఓ పెద్దిరాజు

రేపటి నుంచి చేనేత వస్త్ర ప్రదర్శన

కర్నూలు(అర్బన్): స్థానిక దేవీ ఫంక్షన్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ హాండీ క్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 30 నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు చేనేత వస్త్రాల ప్రదర్శన, అమ్మకాలను ప్రారంభిస్తున్నట్లు లేపాక్షి హస్తకళల ఎంపోరియం మేనేజర్ తిమ్మయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఎగ్జిబిషన్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన ప్రారంభిస్తారని తెలిపారు. సరసమైన ధరలకే ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు అమ్మకాలు కొనసాగుతాయన్నారు. హస్త కళలకు సంబంధించి కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు, రోజ్‌వుడ్, షహరాన్‌పూర్ చెక్క వస్తువులు, ఫొటో ఫ్రేములు, రాగి, ఇత్తడి వస్తువులు, బ్లాక్ మెటల్, వైట్ మెటల్ వస్తువులు అందుబాటులో ఉన్నాయన్నారు.

వృద్ధుడి అనుమానాస్పద మృతి

కర్నూలు: ఆదోని పోస్టల్ కాలనీకి చెందిన మురళీ సుబ్రహ్మణ్యం (62) కర్నూలులోని చిదంబరరావు వీధిలో ఉన్న ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలోని మొదటి అంతస్తు నుంచి లిఫ్ట్‌లో దిగుతూ అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. మురళీ సుబ్రహ్మణ్యం బుధవారం రాత్రి బంధువుల ఇంటికి వచ్చి లిఫ్ట్‌లో నుంచి కిందకు దిగుతూ సొమ్మసిల్లి పడిపోవడంతో స్థానికులు గుర్తించి వైద్యచికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుమారుడు విజయ కార్తీక్ వర్దన్ ఫిర్యాదు మేరకు ఒకటవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీకి యత్నించి మృత్యుఒడి చేరి..

సంజామల: వాటర్‌ప్లాంట్‌లో చోరీకి వెళ్లిన ఓ వ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన సంఘటన మండల కేంద్రం సంజామలలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ప్రతాప్ తెలిపిన వివరాల మేరకు.. అవుకు మండలం ఓబులాపురానికి చెందిన గజ్జి నాగేంద్ర (32) కోవెలకుంట్ల సంతపేటలో నివాసం ఉంటున్నాడు. సంజామల శివారులో ఉన్న వెంకటేశ్వర స్వామి గుడి సమీపంలో ఉన్న వాటర్ ప్లాంట్‌లో బుధవారం అర్ధరాత్రి చోరీ చేసేందుకు వెళ్లాడు. అయితే విద్యుత్ తీగలు తాకడంతో విద్యదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. గురువారం ఉదయం ప్లాంట్ తెరిచేందుకు వెళ్లిన యజమానికి తాళం పగులగొట్టి ఉండటంతో అనుమానంతో లోపలికి వెళ్లి చూడగా మృతదేహం కనిపించడంతో భయాందోళన చెంది వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసుల విచారణలో మృతుడు నాగేంద్రగా గుర్తించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య పద్మావతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



మృతి చెందిన నాగేంద్ర

కేసీ కాల్వలో కారు

గోస్పాడు: సాంబవరం సమీపంలో కేసీ కెనాల్‌లో ఓ కారు అనుమానాస్పదంగా కనిపించింది. నీటిలో కారును గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని స్థానికుల సహాయంతో బయటకు తీశారు. కారులో ఎవరూ లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఏపీ 21ఏడీ 2912 నంబర్ ఉన్న కారు నంద్యాల మండలం పొన్నాపురానికి చెందిన సురేష్‌దిగా పోలీసులు గుర్తించారు. దర్యాప్తు చేపట్టి పూర్తి వివరాలు సేకరిస్తామని ఎస్‌ఐ మల్లికార్జున తెలిపారు.

